క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

కనగల్ : మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శనివారం ఎంపీపీ కరీంపాషా అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అధికారులు తమ శాఖల పూర్తి సమాచారంతో సకాలంలో హాజరు కావాలన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా జనార్దన్ రెడ్డి


కాసాల జనార్దన్‌రెడ్డి

చండూరు : బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మండల పరిధిలోని గుండ్రపల్లి గ్రామానికి చెందిన కాసాల జనార్దన్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి జిల్లా కార్యాలయంలో శుక్రవారం నియామక పత్రం అందజేశారు.

టీబీ బేస్‌లైన్ సర్వే


సర్వేలో పాల్గొన్న విద్యార్థులు

నార్కట్‌పల్లి : జాతీయ క్షయవ్యాధి నిర్మూలన పథకంలో భాగంగా మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు బేస్ లైన్ సర్వే నిర్వహించారు. ఎన్జీ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన ఎన్‌టీఈపీ స్టూడెంట్ పైలెట్ ప్రాజెక్టును స్టేట్ టెక్నికల్ ఆఫీసర్ బి.సురేష్ శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో పర్యటించిన విద్యార్థులు టీబీపై స్థానికులకు అవగాహన కల్పించారు. సర్వేలో క్లస్టర్ కోఆర్డినేటర్ ఎస్.శ్రీనాథ్ పటేల్, కాలేజ్ కోఆర్డినేటర్ భార్గవి, వలంటీర్లు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి


శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షుడు


గోలి స్లీవమ్మ, ప్రధాన కార్యదర్శి

చిట్యాల : పీఆర్‌టీయూ–టీఎస్ చిట్యాల మండల నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను శుక్రవారం జరిగిన ఆ సంఘం సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. మండలంలోని బోయగుబ్బ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షుడుగా, చిట్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న గోలి స్లీవమ్మ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సయ్యద్ యూసూఫ్ పాషా వ్యవహరించారు. నూతన కార్యవర్గానికి ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డితోపాటు మండలంలోని పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

యువకుడు అదృశ్యం

రామగిరి(నల్లగొండ): యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన తిప్పర్తి మండల పరిధిలో ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిప్పర్తి మండల కేంద్రానికి చెందిన పల్లె సంజీవ (27) వ్యాపారం చేస్తున్నాడు. కొంతకాలంగా వివాహం చేసుకోవాలని అతడిని తల్లిదండ్రులు ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 22న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన వారు, బంధువుల వద్ద వాకబ్ చేసినా ఆచూకీ తెలియరాలేదు. దాంతో యువకుడి తల్లి వెంకటమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

సిలబస్ తొలగించొద్దు

నకిరేకల్ : పదో తరగతి సిలబస్‌లో కొంత భాగాన్ని తొలగించడాన్ని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు కనుకుంట్ల విద్యాసాగర్ రెడ్డి ఖండించారు. నకిరేకల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సిలబస్ తొలగించడంపై శాస్త్రవేత్తలు కూడా అభ్యంతరాలు చెప్పారని గుర్తు చేశారు.

న్యాయవాదులకు సన్మానం

నకిరేకల్ : న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా నకిరేకల్‌లో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఉప్పల వెంకటరమణ, కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు ఉప్పల సంతోష్‌కుమార్, వాసవి క్లబ్ అధ్యక్షుడు పోలవరపు వెంకటశ్రీనివాసు, కందగట్ల శ్వేత, వీరమల్ల రవీందర్, చంద కిష్టయ్య, శివకోటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

మాడుగులపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని కిసాన్ కాంగ్రెస్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జెడ్పీటీసీ పుల్లెంల సైదులుతో కలిసి పరిశీలించి ఆయన మాట్లాడారు. ధాన్యం కాంటాలను త్వరగా పూర్తి చేసి మిల్లులకు తరలించాలని కోరారు.

నేటి నుంచి సాయి మందిర ఉత్సవాలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ నిర్వాహకులు
- భారీగా తరలిరానున్న భక్తులు


నకిరేకల్‌లోని ఐశ్వర్యసాయి మందిరం


ఆలయంలో కొలువుదీరిన సాయినాథుడు


శివలింగంలో సాయి ప్రతిమ


ఉసిరి చెట్టుకింద సాయి విగ్రహం

నకిరేకల్ : నకిరేకల్‌లోని ఐశ్వర్యసాయి మందిర 16వ వార్షిక వేడుకలు ఈ నెల 29 శనివారం నుంచి 30వ తేదీ వరకు రెండు రోజులు వైభవంగా జరగనున్నాయి. నకిరేకల్‌లోని హైదరాబాద్–విజయవాడ 65 నంబర్ జాతీయ రహదారి వెంట రూ.10 కోట్లతో దాతల సహకారంతో భారీ హంగులతో సాయి మందిరం, కల్యాణ మండపాలు నిర్మించారు. భారీ వ్యయంతో నిర్మితమైన షిర్డీసాయి బాబా ఆలయం భక్తులను ఆకర్షిస్తూ భక్తిభావాన్ని పెంపొందిస్తోంది. రోజురోజుకు ఈ ఆలయంలో భక్తుల తాకిడి పెరుగుతోంది. జిల్లా ప్రజలే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వివిధ జిల్లాల భక్తులు, పరిసర ప్రాంత వాసులు ఈ ఆలయాన్ని సందర్శించి పునీతులవుతున్నారు.

2007లో విగ్రహ ప్రతిష్ఠాపన..

ఈ ఆలయంలో 2007 ఏప్రిల్ 30వ తేదీన శ్రీ రమణానంద మహర్షి చేతులమీదుగా సాయి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇక్కడ సాయి నాథుడిని ఐశ్వర్య సాయిగా భక్తులు పిలుస్తుంటారు. ఈ ఆలయం పక్కనే షిర్డీసాయి కల్యాణ మండపాన్ని కూడా నిర్మించారు. సాయి మందిరం పక్కనే ఆలయ ప్రాంగణంలో పచ్చని గడ్డి, చెట్లు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. పచ్చని ఉసిరి చెట్టుకింద సాయి నాథుడిని ప్రతిష్ఠించారు. ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల పూల మొక్కలు, చెట్లు పెంచుతున్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ కాంతులతో మెరిసిపోయే ఆలయం మైమరిపిస్తుంది. ఐశ్వర్య సాయి మందిరం ముందు ద్వారానికి ఇరువైపులా సిమెంట్‌తో రెండు ఏనుగు బొమ్మలను నిర్మించారు. ఈ ఆలయం ముందు పూల గార్డెన్ పక్కన ఏనేరాతి గుండ్లతో పేర్చిన గుట్టపై శివలింగాన్ని నెలకొల్పారు. ఈ శివలింగంలో సాయినాథుడు భక్తులకు దర్శనమిస్తుండడం ఆకట్టుకుంటుంది. ఆలయంలోకి ప్రవేశించగానే శివలింగం, అందులో ఉన్న సాయి కనిపిస్తుంటాడు.

నేటినుంచి ఉత్సవాలు ప్రారంభం

నకిరేకల్ పట్టణంలోని శ్రీ సాయిబాబా మందిర 16వ వార్షికోత్సవం, శ్రీ జ్ఞాన సరస్వతిదేవి అష్టమ వార్షికోత్సవాలు ఈ నెల 29, 30 తేదీల్లో జరగనున్నాయి. 29న అభిషేకాలు, మహిళలతో కుంకుమ పూజ, 30న 108 కలశాలతో ఫల పుష్ప, సుగంధ పంచామృతాలతో రుద్రాభిషేకం, 108 నైవేద్యాల నివేదన ప్రత్యేక పూజలు, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



ఈ నెల 29, 30 తేదీల్లో సాయి మందిరం వార్షికోత్సవం సందర్భంగా భక్తులు తగిన ఏర్పాట్లు పూర్తి చేశాం. రెండు రోజుల పాటు హాజ రైన భక్తులకు అన్నదానం కూడా నిర్వహించనున్నాం. వేసవికాలం కావడంతో షామీయానాలు వేశాం.

– కాసం లింగయ్య, ట్రస్ట్ చైర్మన్, నకిరేకల్

విద్యా వ్యవస్థను పట్టించుకోని ప్రభుత్వం


నిమ్మరసం అందజేసి దీక్ష విరమింపజేయిస్తున్న ఏఐసీసీ నాయకుడు హనుమంతరావు

చిట్యాల : విద్యా వ్యవస్థలను నిర్వీర్యం చేసి, నిరుద్యోగులను మోసం చేసేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఏఐసీసీ నాయకుడు, మాజీ ఎంపీ హనుమంతరావు విమర్శించారు. చిట్యాలలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ యువజన కాంగ్రెస్ నాయకుడు పల్లపు చందు ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, వృత్తి విద్యా కాలేజీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ పోటీ పరీక్షల, వార్షిక పరీక్షల పేపర్లు లీకేజీ అవుతున్నా ప్రభుత్వం దోషులను శిక్షించలేకపోతోందన్నారు. అంతకుముందు దీక్ష శిబిరాన్ని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, యాదాద్రి భువనగిరి డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ మాజీ కార్యదర్శి దైద రవీందర్, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, జడల చినమల్లయ్య, ఎస్‌కే ఇబ్రహీంలు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో వడ్డెగాని వెంకన్నగౌడ్, చెరుకు బాలకృష్ణగౌడ్, శివగోని వెంకన్నగౌడ్, గుంజ వెంకటేష్, లేదర్ల వంశీ, ఓర్సు సాయిలు కూర్చున్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి


రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

నకిరేకల్ : నకిరేకల్ మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ ఈఈ గిలకత్తుల సత్యనారాయణ గౌడ్ ఆదేశించారు. శుక్రవారం పట్టణంలో జరుగుతున్న మినీ ట్యాంక్ బండ్ పనులు, రోడ్డు విస్తరణ, 100 పడకల వైద్యశాల భవన నిర్మాణం, ఎర్రకుంటలో వైకుంఠధామం పనులను ఆయన పరిశీలించారు. సంబంధిత అధికారులతో పనుల పురోగతిపై చర్చించారు. అన్ని అభివృద్ధి పనులు గడువులోగా నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు విస్తరణ విషయంలో నిబంధనలు పాటించాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, డీఈ మనోహర్, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, ఏఈ గౌతం సిబ్బంది ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


నకిరేకల్ : కూలీలతో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

నకిరేకల్ : ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు సూచించారు. నకిరేకల్ మండలం గోరెంకలపల్లి, మంగళపల్లి, నర్సింహాపురం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆమె సందర్శించి రైతులతో మాట్లాడారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. ఐకేపీ ఏపీఎం ప్రభాకర్ మాట్లాడుతూ చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. అదేవిధంగా మంగళపల్లి, గోరెంకలపల్లి, నర్సింహాపురం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ ప్రసాద్, డీటీసీఎస్ జావిద్ సందర్శించారు. ఈ సందర్భంగా మంగళపల్లి సర్పంచ్ ప్రగడపు నవీన్‌రావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూడాలని కోరారు.

లారీల కొరత లేకుండా చూడాలి

కేతేపల్లి : కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేందుకు లారీల కొరత లేకుండా చూడాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కందాల ప్రమీల అధికారులను కోరారు. మండలంలోని చీకటిగూడెం, ఉప్పలపహాడ్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం రైతుసంఘం, సీపీఎం నాయకులతో కలిసి శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తేమశాతం, తరుగు పేరుతో మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు ఏళ్ళ అశోక్‌రెడ్డి, సాగె నాగయ్య, సొదయ్య, చెవుగోని, నాగయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె


నకిరేకల్ : పంచాయతీ కార్యదర్శుల సమ్మెలో మాట్లాడుతున్న శంకరయ్య


నార్కట్‌పల్లి : సమ్మెలో పాల్గొన్న కార్యదర్శులు


శాలిగౌరారం : సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు


కట్టంగూర్ : సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

నకిరేకల్ : తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరుతూ నకిరేకల్‌లోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సమ్మెకు పంచాయతీ కార్యదర్శుల సంఘం సీనియర్ ప్రతినిధి బొల్లేపల్లి శంకరయ్య మద్దతు తెలిపారు.

నార్కట్‌పల్లిలో..

నార్కట్‌పల్లి : మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం సమ్మె నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరేష్, అలెందర్‌రెడ్డి, శ్రీకాంత్, వెంకన్న, రాంబాబు, రామస్వామి, రమేష్, రాణి, స్వరూప, జానకమ్మ, సుమలత, మమత తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారంలో..

శాలిగౌరారం : తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో మండలంలోని జూనియర్,ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కట్టంగూర్‌లో..

కట్టంగూర్ : తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ శుక్రవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ సెక్రటరీలు, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ సెక్రటరీలు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు వి.అశోక్, జి. శివ, ఇ. రవీందర్, సంతోష్, సురేష్, వెంకటేష్, ఉపేందర్, సైదులు, తన్వి, సుష్మ, సంధ్య, కల్పన ఉన్నారు.

మర్రిగూడ : తమను రెగ్యులరైజ్ చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం మండల కేంద్రంలో నిరవధిక సమ్మె ప్రారంభించారు. సమ్మెకు ప్రజా నాట్య మండలి జిల్లా నాయకుడు చల్లం పాండురంగారావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు షాకీర్, మల్లేష్, లక్ష్మీ, శిరీష, లింగస్వామి, నాగమణి, వెంకన్న, రాకేష్, పార్వతి, మౌనిక, ఉమాదేవి, బాబు, పద్మ, గీత తదితరులు ఉన్నారు.

కనగల్ : తమ ఉద్యోగ సర్వీసును క్రమబద్ధీకరిణ చేస్తూ జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కనగల్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద శుక్రవారం నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన 4సంవత్సరాల ప్రొబేషనరీ కాలాన్ని సర్వీసు కాలంగా పరిగణించాలన్నారు.

భిక్షాటన చేస్తూ వీఓఏల నిరసన


కేతేపల్లిలో భిక్షాటన చేస్తున్న వీఓఏలు

కేతేపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కేతేపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం కొనసాగింది. ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ వీఓఏలు భిక్షాటన చేశారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు తండు సుమీల, ఏడాకుల సంధ్య, ప్రధాన కార్యదర్శి కాడంగి వీరభద్రయ్య, సత్యనారాయణ, ముషం శ్రీను, పద్మ, సరిత, పద్మ, మరియరోజా, వాణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమ్మెకు సంఘీభావం

చిట్యాల : తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌చేస్తూ చిట్యాలలో వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం పదకొండో రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని ఏఐసీసీ నాయకుడు హన్మంతరావు, టీపీసీసీ మాజీ కార్యదర్శి దైద రవీందర్, యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, జడల చినమల్లయ్య, ఎస్‌కె.ఇబ్రహీం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్, వీఓఏల అధ్యక్షురాలు ఏదుళ్ళ లక్ష్మీ, ప్రధానకార్యదర్శి గుడిసె సువర్ణ, గుడిసె పద్మ తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారంలో..

శాలిగౌరారం : మండలంలోని వీఓఏలు మండల కేంద్రంలో చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం కొనసాగింది. సమ్మెకు కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ నాయకుడు వడ్డెపల్లి రవి మద్దతు తెలిపి సమ్మెలో పాల్గొన్నారు. అనంతరం వీఓఏలకు రూ.5వేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, నాయకులు కందాల సమరంరెడ్డి, నరేశ్, వెంకటయ్య, వీఓఏలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె

మర్రిగూడ : మండల కేంద్రంలో వీఓఏలు చేపడుతున్న నిరవధిక సమ్మె శుక్రవారం కొనసాగింది. ఈ సమ్మెలో చంద్రకళ, మంజుల, పద్మ, పాపాచారి, పురుషోత్తం, సిరియాల, భాగ్యలక్ష్మీ, కవిత, సుమలత, శాంతి, మానస, శిరీష, కరుణ, యమున తదితరులు పాల్గొన్నారు.

దీక్షకు అఖిలపక్ష నాయకుల మద్దతు


దీక్షకు మద్దతు తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా గ్రామస్తులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష 8వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షలకు ఇప్పర్తి గ్రామ అఖిలపక్ష నాయకులు దీక్షకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు, ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు నందిపాటి వెంకన్న, ఇప్పర్తి సర్పంచ్ బొజ్జ సుజాతశ్రీను, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురిగి నరసింహ, బీజేపీ నాయకులు భవనం మధుసూదన్‌రెడ్డి, బూడిద లింగయ్య, బొడిగ అశోక్, యువమోర్చా నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ పుల్కరం సైదులు, దళితమోర్చా మండల అధ్యక్షుడు గాలయ్య, లింగారెడ్డి, చంద్రారెడ్డి, మల్లయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పరామర్శ


మారయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

చండూరు : మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన మహబూబ్ నగర్ ఎస్పీ కొత్తపల్లి నర్సింహ గౌడ్ తండ్రి మారయ్య (75) ఇటీవల గ్రామంలో మృతి చెందాడు. ఎస్పీ కుటుంబాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పరామర్శించి మారయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట పల్లె వెంకన్న ఉన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తిపై హత్యాయత్నం

మునుగోడు : కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిగిన సంఘటన శుక్రవారం మండలంలోని పులిపలుపుల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పులిపలుపుల గ్రామానికి చెందిన గోపగోని గోపాలుకు ఇద్దరు భార్యలు. గోపాల్ ఏడేళ్లుగా చిన్న భార్య సుగుణమ్మను వదిలేసి పెద్ద భార్య రజితతో కలిసి హైదరాబాదులో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం పులిపలుపుల గ్రామానికి వచ్చి తన ఇంట్లో ఓ దేవత పండుగ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు. విషయం తెలిసిన చిన్న భార్య సుగుణమ్మ తన ఇద్దరు కుమారులు, కుటుంబ సభ్యులతో కలిసి పులిపలుపుల గ్రామానికి వచ్చి గోపాల్‌ను నిలదీసింది. దీంతో గోపాల్ పండుగ అయిన తర్వాత మాట్లాడుకుందామని నచ్చజెప్పడంతో సుగుణమ్మ కుటుంబ సభ్యులు అక్కడినుంచి వెళ్లిపోయారు. అదే సమయంలో సుగుణమ్మపై మతిస్థిమితం లేని పెద్ద కుమారుడు శివ పెట్రోలు పోసి నిప్పంటించాడని పలువురు ఆరోపిస్తున్నారు. సుగుణమ్మ శరీరం యాభై శాతం కాలి గాయాలయ్యాయి. సుగుణమ్మ కుటుంబ సభ్యులు మాత్రం భర్త గోపాలు ఆమెపై పెట్రోల్ పోసి హత్యాయత్నం చేశాడని ఆగ్రహించి గోపాల్‌పై గొడ్డలి, కర్రలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన గోపాల్‌ను, సుగుణమ్మను చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. జరిగిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ధాన్యం రవాణా వేగవంతం


శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం బస్తాలను లారీలోకి ఎత్తుతున్న హమాలీలు

సాక్షి ఎఫెక్ట్..

శాలిగౌరారం : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం బస్తాల నిల్వలపై శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో 'పేరుకుపోయిన ధాన్యం నిల్వ లు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మూడు రోజులుగా పేరుకుపోయిన ధాన్యం బస్తాలను సంబంధిత అధికారులు శుక్రవారం రైస్‌మిల్లులకు రవాణా చేయించారు. సమస్య పరిష్కారమయ్యేలా కథనం ప్రచురించిన 'సాక్షి' దినపత్రికకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

జన చైతన్య బైక్‌యాత్రకు స్వాగతం


యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

కట్టంగూర్ : గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమకారుడు, గ్రామీణ వైద్యుడు తూతిక ప్రకాశ్ చేపట్టిన బైక్ యాత్ర శుక్రవారం కట్టంగూర్‌కు చేరుకుంది. మార్చి 10న భద్రాచలం నుంచి బయలుదేరి ములుగు, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, కరీంనగర్, జగిత్యాల, కామారెడ్డి, సిద్దిపేట, సిరిసిల్ల, మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి మీదుగా శుక్రవారం కట్టంగూర్‌కు చేరుకుంది. స్థానిక బీఆర్ఎస్ నాయకులు బైక్ యాత్రకు స్వాగతం పలికి తూతిక ప్రకాశ్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొల్లెద్దు యాదయ్య, రెడ్డిపల్లి మనోహర్, యర్కల శ్రీను, ఐతగోని సైదులు తదితరులు ఉన్నారు.

'నిరుద్యోగులను దారి మళ్లించడానికే దీక్ష'

రామగిరి(నల్లగొండ) : నిరుద్యోగ యువతను దారి మళ్లించడానికే పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నిరుద్యోగ దీక్ష, గర్జనలు చేస్తున్నారని కేజేఆర్ నీలి యువసైన్యం కార్యదర్శి సీహెచ్.రాంబాబు, పున్న సత్యం అన్నారు. స్థానిక ఎన్జీ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ ప్రభుత్వం పోలీసు శాఖ తరఫున 30 వేల ఖాళీలు నింపిందన్నారు. వివిధ శాఖల్లో లక్షా ముప్పయ్ వేల ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. విపక్ష కాంగ్రెస్, బీజేపీలు పోటీ పరీక్షల, పదో తరగతి పరీక్షల పేపర్ లీకేజీలని, కోర్టు కేసులని గందరగోళం సృష్టించి నిరుద్యోగ యువతను అయోమయానికి గురి చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కేజేఆర్ నీలి యువసైన్యం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొండేటి మహేష్, సీహెచ్. రమేష్, జే.ఆనంద్, పి.వినోద్, వేణు, మహేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తండు సైదులుగౌడ్ రాస్తారోకో

నల్లగొండ : నిరుద్యోగ నిరసన ర్యాలీకి టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వస్తున్న సందర్భంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు తండు సైదులు గౌడ్ స్వాగతం తెలుపుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే ఈ ఫ్లెక్సీలను కోమటిరెడ్డి అనుచరులు చించారని సైదులుగౌడ్ శుక్రవారం గడియారం సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. తన ఎదుగుదలను జీర్ణించుకోలేని కోమటిరెడ్డి తన అనుచరులతో ఫ్లెక్సీలను తొలగించారని సైదులుగౌడ్ ఆరోపించారు.


రాస్తారోకో చేస్తున్న తండు సైదులు గౌడ్

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా

నల్లగొండ టూటౌన్ : విద్యార్థులు పట్టుదలతో ముందుకు సాగుతూ చదువుతోపాటు తమకు నచ్చిన క్రీడల్లోనూ రాణించాలని అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో జిల్లా యువజన క్రీడల శాఖ, ఫ్రీడం క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనే విధంగా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. క్రీడా పోటీల్లో జాతీయ, అంతర్జాతీ స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. క్రీడల వల్ల శారీరక దేహదారుఢ్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి మక్బుల్ అహ్మద్, ఫ్రీడం క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రహీం, డాక్టర్ రాఘవేందర్‌రెడ్డి, బి.గిరిబాబు, అలీం, పాల్, తాజ్ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి

నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ ఔట్‌డోర్ స్టేడియంలో క్రీడాకారులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ స్టేడియం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అదనపు కలెక్టర్ ఖుష్బుగుప్తాకు వినతిపత్రం అందజేశారు. స్టేడియంలో ఐమాక్స్ లైట్లు, తాగు నీటి వసతి కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో కమిటీ అధ్యక్షుడు బొమ్మపాల గిరిబాబు, ప్రధాన కార్యదర్శి షేక్ రహీం, మద్ది కరుణాకర్, అంబటి ప్రణీత్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

30న ఉచిత వైద్యశిబిరం

చండూరు : మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో ఈ నెల 30న రాధస్వ అమీసత్సంగ్ (దయాల్ బాగ్) ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పిల్లల, దంత, కంటి, స్త్రీల, సాధారణ సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తామన్నారు. అదేవిధంగా కంటి అద్దాలు ఉచితంగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.